# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టే అధికారులకు తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నేతలు, కార్యకర్తలు సహకరించాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.**

3. **భారీ వర్షాల నేపథ్యంలో వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖామంత్రి కె.అచ్చెన్నాయుడు సూచించారు.**

4. **వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు, వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ ఆదేశాలు జారీ చేశారు.**

5. **సంస్కరణలు, స్థిరమైన పరిపాలన, సులభతర వాణిజ్య విధానాలతో దేశాభివృద్ధి సాధ్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టంచేశారు.**

=========================

రాష్ట్రంలో వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీస్ డైరెక్టర్ జనరల్, జిల్లా కలెక్టర్లు, పోలీస్ సూపరింటెండెంట్లతో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితులపై ఈ రోజు ఆయన శ్రవణ మాధ్యమ విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వర్షాల తీవ్రత తగ్గిందని, అయితే ఇంకా వరదలోనే ఇళ్లు, కాలనీలు ఉన్నాయని తెలిపారు. రహదారులపైనున్న నీటికి బయటకు పంపడంతో పాటు.. నివాస ప్రాంతాల్లో వరద సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వరద ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా పరిస్థితిని సమీక్షించి, అందుకు అనుగుణంగా సహాయక చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. వర్షాలు, వరదల కారణంగా ఆహారం, నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ,గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా పంటనష్టం అంచనాలను కేంద్ర ప్రభుత్వానికి పంపాలని సూచించారు.

------------------------

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టే అధికారులకు తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. విజయవాడలో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన విచారం

వ్యక్తం చేశారు. వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల 10 మంది ప్రాణాలు కోల్పోవడం ఆవేదన కలిగించిందని పేర్కొన్నారు. కాగా ఈ ఘటన పట్ల భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి కూడా విచారం వ్యక్తంచేశారు. వరద సహాయక చర్యల్లో పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఒక ప్రకటనలో కోరారు.

---------------------------

భారీ వర్షాల నేపథ్యంలో వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ శాఖ, మత్స్య శాఖ, పశు సంవర్ధక శాఖల కంట్రోల్ రూమ్‌ల సేవలపై సమీక్ష నిర్వహించిన ఆయన.. ప్రాణ నష్టం, పశు నష్టం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గడిచిన రెండు రోజుల్లో అధిక వర్షాల కారణంగా రాష్ట్రంలో 4 పశువులు మృతి చెందాయని అధికారులు తెలపగా.. పశు నష్టం జరుగకుండా రైతులకు సూచనలు ఇవ్వాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు. అందుకు అనుగుణంగా అవసరమైన మందులతో పశు వైద్య అధికారులు సిద్ధంగా ఉండాలని మంత్రి దిశా నిర్దేశం చేశారు.

---------------------------

కొండపల్లి ఘాట్‌రోడ్డులో బండరాళ్లు, చెట్లు విరిగిపడటంతో అధికారులు ఘాట్‌రోడ్డుపై రాకపోకలను నిలిపివేశారు. ఫలితంగా కొండపల్లి ఖిల్లా నుంచి దూరదర్శన్, ఆకాశవాణి కార్యాలయానికి వెళ్లే రహదారి మూసివేశారు. అందువల్ల ఆకాశవాణి, ప్రైవేట్ ఎఫ్ఎం రేడియో సిబ్బంది, భద్రతా సిబ్బంది గడిచిన 72 గంటల నుంచి ఆకాశవాణి కార్యాలయంలోనే ఉండి విధులు నిర్వహిస్తున్నారు.

---------------------------

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రుల్లో విద్యుత్తు సరఫరాకు అవరోధాలు లేకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వరద నీరు నిల్వ ఉండకుండా చూడాలని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లా అధికారులతో సంప్రదింపులు చేసుకుంటూ అవసరమైన చోట్లకు వైద్య బృందాలు చేరుకోవాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టి.కృష్ణబాబు రాష్ట్ర, జిల్లా అధికారులతో వైద్య సహాయక చర్యలపై సమీక్షించారు. ప్రసవ తేదీల ఆధారంగా గర్భిణులను సమీపంలోని ఆసుపత్రులకు చేర్చేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు. రాష్ట్ర స్థాయిలో ముగ్గురు సీనియర్ అధికారులతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఈ నెల 3వ తేదీ వరకు నిరంతరం పనిచేస్తుందని కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ కమిషనర్ హరికిరణ్ తెలిపారు.

---------------------------

భారతదేశంలో ఉన్నన్ని వనరులు, అవకాశాలు ప్రపంచంలో మరెక్కడా లేవని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. సంస్కరణలు, స్థిరమైన పరిపాలన, సులభతర వాణిజ్య విధానాలతో అధిక అభివృద్ధి సాధ్యమని స్పష్టంచేశారు. ఢిల్లీలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ ప్రపంచదేశాల నేతల సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. దేశ సుస్థిరాభివృద్దే లక్ష్యంగా తమ ప్రభుత్వం సంస్కరణ, పనితీరు, పరివర్తన అనే మంత్రం ఆధారంగా పనిచేస్తోందని వెల్లడించారు. గడిచిన 10 సంవత్సరాల్లో భారత ఆర్థిక వ్యవస్థ 90 శాతం వృద్ధి సాధించిందని, అదే సమయంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 35 శాతం వృద్ధి సాధించిందని తెలిపారు. ఈ స్థిరమైన వృద్ధి భవిష్యత్తులో కూడా

కొనసాగుతుందని ప్రధానమంత్రి స్పష్టంచేశారు. దేశం సాధించిన విజయాలను ప్రజలు గమనిస్తూ చూస్తున్నారని, ఆత్మవిశ్వాసంతో ఉన్నారని ప్రధనమంత్రి పేర్కొన్నారు.

---------------------------

దేశ వ్యాప్తంగా పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న పోషకాహార మాసం.. పోషణ అభియాన్.. కార్యక్రమం ఈ రోజు నుండి ప్రారంభమవుతుంది. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మహిళ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ పిల్లలలో రక్త హీనత నివారించడం, తక్కువ బరువుతో పుట్టే పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, యుక్త వయసులో ఉన్న బాలికలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, చిన్న వయసు నుండే పిల్లలకు పోషకాహారం అందించడంపై దృష్టి సారిస్తుంది. పోషణ అభియాన్ కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2018 మార్చి 8వ తేదీన రాజస్థాన్ రాష్ట్రంలోని జుంజును జిల్లాలో ప్రారంభించారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి జరిగే ఈ బృహత్ యజ్ఞంలో ప్రజలంతా విస్తృత స్థాయిలో భాగస్వామ్యం కావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిస్తూ...

వాయిస్ ( 31 ) సెకన్స్

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాలు వరద ముంపులో చిక్కుకోగా జాతీయ విపత్తు నిర్వహణ బృందాలు, రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయ చర్యలు ప్రారంభించాయి. ఏలూరు జిల్లా నూజివీడులో చిక్కుకున్న 62 మందిని ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రక్షించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం శాంతినగర్ వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పరిటాల లోని ఫ్యాక్టరీ వద్ద వరదలో చిక్కుకున్న 50 మంది కూలీలను రక్షించారు. రాయనపాడు, విజయవాడ, జి.కొండూరు, నున్న, పెనుగంచిప్రోలు ప్రాంతాలలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆరుచోట్ల వరదల్లో చిక్కుకున్న 588 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎన్టీఆర్ జిల్లాలో సహాయక చర్యల్లో 2 వేల మంది పోలీసులు పాల్గొంటున్నారు. మరోవైపు.. విజయవాడ నగరంలోని ముంపు ప్రాంతాల్లో పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ.. పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి పర్యటించి పరిస్థితిని పర్యవేక్షించారు.

---------------------------

తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మహబూబాబాద్ సమీపంలోని అయోధ్య గ్రామంలో చెరువు కట్ట తెగిపోవడంతో విజయవాడ– కాజీపేట మార్గంలో పలు రైళ్లు నిలిచిపోయాయి. ఇంటికన్నె–కేసముద్రం మధ్య రైల్వే ట్రాక్ కింద కంకర కొట్టుకుపోయింది. మహబూబాబాద్ శివారులో రైలుపట్టాలపై భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. ఫలితంగా మచిలీపట్నం, సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లను మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. తాళ్లపూసలపల్లి వద్ద రైల్వేట్రాక్‌కు వరద తాకడంతో పందిళ్లపల్లి వద్ద 4 గంటలపాటు మహబూబ్‌నగర్–విశాఖ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. విజయవాడ–కాజీపేట మార్గంలో ట్రాక్ పైకి వరద చేరికతో 24 రైళ్లను నిలిపివేశారు. సింహాద్రి, మచిలీపట్నం, గౌతమి, సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్, గంగా–కావేరి, చార్మినార్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోయాయి. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్– విజయవాడ మధ్య 30 రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. దూరప్రాంత రైళ్లను విజయవాడ, గుంటూరు, నల్గొండ, పగిడిపల్లి మీదుగా హైదరాబాద్‌కు మళ్లించారు. ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసింది.

---------------------------

=====================